క్లుప్తంగా

గ్రామాల్లో ఉపాధి పనుల గుర్తింపు



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్

రాజవొమ్మంగి: మండలంలోని చెరకుంపాలెం గ్రామ సచివాలయంలో శనివారం జరిగిన మొదటి విడత గ్రామసభలో సుమారు రూ. కోటి అంచనాతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పనుల గుర్తింపు జరిగింది. పంచాయతీలోని సంజీవనగరం, బోర్నగూడెం, వెలగలపాలెం, మర్రిపాలెం గ్రామాల్లో గుర్తించిన వాటిలో ముఖ్యంగా సాగునీటి చెరువుల నిర్మాణం, పంటకాలువ పూడికతీత, గ్రావెల్ రోడ్ల నిర్మాణం, జీవ గట్లు, చిన్న చెరువులు, పుంత రోడ్లు, పండ్ల తోటల పెంపకం తదితర అభివృద్ధి పనులు ఉన్నాయి. సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ గ్రామ సభలో ఏఈ శ్రీనివాస్, కార్యదర్శి షేక్ నాగూర్ వల్లీ, టీఏ సుబ్బారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, వేతన దారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టూరిజం కార్మికుల నిరసన



బొర్రా వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు తదితరులు

అనంతగిరి: అల్లూరి జిల్లా ఆరు యూనిట్లలో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని కోరుతూ శనివారం బొర్రాలోని టీడీపీ, సీపీఎం, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, బొర్రా సర్పంచ్ అప్పారావు, నవీన్ మాట్లాడుతూ టూరిజం కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు హెచ్‌ఆర్‌పి పాలసీని అమలుచేయాలని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. టూరిజం కార్మికులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఏర్పాటుకు వినతి



సమావేశంలో పాల్గొన్న క్రైస్తవ సంఘం నాయకులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో క్రైస్తవుల కోసం శ్మశానవాటిక, కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని క్రైస్తవ సంఘ పెద్దలు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక ఈబీసీ మందిరంలో సమావేశమైన పలువురు బిషప్‌లు, పాస్టర్లు శ్మశానవాటిక లేకపోవడం వల్ల తలెత్తుతున్న ఇబ్బందులపై చర్చించారు. ఈ సమస్యను రెవెన్యూ తదితర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. రెవరెండ్ చంటిబాబు, మోషేరాజు, ఇస్రాయేలు, ఇమ్మాని యేలు, ప్రేమ భూషణం, జోసెఫ్‌రాజు, జాన్ వెస్లీ, పెద రూబేను, బాబూరావు, జెక్కరయ్య, సంజీవరావు, పాల్‌ప్రసాద్, శ్యామ్ పాల్గొన్నారు.

సహకార సంఘ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక : సహకార సంఘ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నాగులాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల ఉమామహేశ్వరరావు కోరారు. నాగులాపల్లి పీఏసీఎస్ ద్వారా జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా 13 మంది మహిళా పాడి రైతులకు రూ.6లక్షల రుణం అందజేశారు. సంఘ సభ్యులకు రూ.6.43 లక్షల మేర బోనస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘ సభ్యులకు అవసరమయ్యే సేవలను అందజేస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అమూల్ దోహదపడుతుందన్నారు. సంఘ సభ్యులను ప్రోత్సహించేందుకు బోనస్ అందజేస్తున్నామన్నారు. 15శాతం మేర బోనస్ అందజేసి సభ్యులను ప్రోత్సహిస్తున్నామన్నారు. సీఈవో స్వామి, సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ

రాంబిల్లి: మహిళల ఆర్థిక , ఆరోగ్య అభివృద్ధికి పెరటి కోళ్ల పెంపకం ఎంతో దోహదపడుతుందని ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు అన్నారు. డీఆర్‌డీఏ వెలుగు విభాగం ద్వారా 50 యూనిట్లు కోళ్లను మహిళలకు రాంబిల్లిలో శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్‌రాజు, మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన



పెదకోటలో స్థానికులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ శెట్టి నీలవేణి తదితరులు



మంటూరు కాలనీలో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- గడప గడపకు విశేష ఆదరణ
- ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మికి ఘన స్వాగతం
- సమస్యల పరిష్కారానికి హామీ

అనంతగిరి: రాష్ట్రంలోని ఓ వైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని మారుమూల పెదకోట పంచాయతీ చటకంభ, పెదబయల్, చింతలపాలెం, రేగులపాలెం, కొండిభకోట, పెదకోట గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లోని 413 గడపలను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజనులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రభుత్వం పాలనలోని మారుమూల పంచాయతీల్లో సైతం ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, కులమతాలకు అతీతంగా, పార్టీలకతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గడప గడప కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు స్వయంగా గ్రామాలకు వెళ్లి, సమస్యలు పరిష్కరించే దిశగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, సీఎం ఆలోచన విధానాన్ని కొనియాడారు. గడప గడప నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్య పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, వైస్ ఎంపీపీ బాడం శకుంతల, సర్పంచ్ అన్నపూర్ణదేవి, ఎంపీటీసీ శ్రావణి, మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూర్యనారాయణ, నాయకులు నాగేశ్వరరావు, గంగులు, మధుసూదన్, గంగరాజు, నూకరాజు, బుజ్జిబాబు, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం

దేవీపట్నం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ప్రతి కుటుంబం సంక్షేమ పథకాలతో లబ్ధిపొందుతోందని, గడప గడపకూ సంక్షేమ వెలుగులు సంతరించుకున్నాయని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. దేవీపట్నం మండలంలోని మంటూరు, ఏనుగులగూడెం, గానుగులగొంది గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో 285 గడపలను ఎమ్మెల్యే నాగులపల్లి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో వేగవంతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులకు తెలియజేశారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గృహసారధులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. ప్రజారోగ్యానికి రక్ష



మంప గ్రామంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్

కొయ్యూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి మన్యంలో విశేష ఆదరణ లభిస్తోంది. గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు గిరిజనులు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. శిబిరాల్లో ఉచితంగా మందులు అందజేస్తున్నారు. మండలంలోని మంప గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బడుగు రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. జగనన్న సురక్ష ప్రజారోగ్యానికి రక్ష అని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు మందులు అందజేయడం హర్షణీయమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంపలో నిర్వహించిన వైద్య శిబిరంలో 389 మందికి వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ ఇంగువ త్రినాథ్‌పడాల్, పార్టీ మండల అధ్యక్షుడు బాబులు, సచివాలయ కన్వీనర్ సుధాకర్, నాయకులు సత్యనారాయణ, సత్తిబాబు, కొండబాబు, ఆగూరు రాంబాబు పాల్గొన్నారు.

హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గడప వద్దకే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని గూడలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో శిబిరాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో శిబిరానికి వచ్చిన రోగుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గూడ గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 250 మందికి వైద్యపరీక్షలు చేశారు. వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్, వైస్ ఎంపీపీ ఒంటుబు ప్రియాంక, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, మాజీ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్, వైద్యాధికారులు అనుషా, గాయత్రి, శివమణి నాయకుడు కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

26న విశాఖ-రాయగడ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: రాయగడ-విజయనగరం సెక్షన్ పరిధిలో భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల కారణంగా ఆయా తేదీల్లో పలు రైళ్ల రద్దు చేశారు. ఈ నెల 26న విశాఖపట్నం-రాయగడ(08504) పాసింజర్, 27న రాయగడ-విశాఖపట్నం(08503) పాసింజర్, విశాఖపట్నం-కోరాపుట్ -విశాఖపట్నం (08546/08545) పాసింజర్, విశాఖపట్నం-కోరాపుట్ (18512) ఎక్స్‌ప్రెస్, 28న కోరాపుట్-విశాఖపట్నం(18511) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు డీసీఎం తెలిపారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు

పెదబయలు: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం శనివారం జరిగింది. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తోన్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో సాధ్యమైందని పార్టీ రాష్ట్ర ఆగ్రో డైరెక్టర్ వనల్బ సన్యాసి, పార్టీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి చెట్టి వినయ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరకు నియోజకవర్గంలో ఎన్నడూ లేని అభివృద్ధి జగనన్న ప్రభుత్వంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సారథ్యంలో జరుగుతోందన్నారు. గత టీడీపీ హయాంలో నియోజకవర్గంలో కనీస అభివృద్ధి జరగలేదన్నారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రత్యేక చొరవతో అరకు నియోజకవర్గంలో శివారు గ్రామాల్లో సైతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. స్వాతంత్ర్యం నాటి నుంచి రోడ్డు సదుపాయానికి నోచుకోని పెదబయలు మండలంలో అతిమారుమూల జామిగుడ. గిన్నెలకోట, ఇంజరి, కుంతుర్ల, వనభంగి, పంచాయతీలకు తారు రోడ్ల సదుపాయం కల్పించిన ఘనత సీఎం జగన్‌తోనే సాధ్యమైందన్నారు. అదే విధంగా గోమంగి, కిముడుపల్లి, రూడకోట ఇతర పంచాయతీలకు జిల్లా కేంద్రం పాడేరు, మండల కేంద్రానికి రోడ్ల అనుసంధానం చేయడానికి ఎమ్మెల్యే పాల్గుణ కృషి చేశారన్నారు. గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత నిస్తుందన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలు, పీహెచ్‌సీల్లో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లంగి ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు వి.ఆనందరావు, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ, సర్పంచ్‌లు కె. సురేష్‌కుమార్, కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యులు వి.అప్పారావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ధనలక్ష్మి, నాయకులు అప్పారావు,వెంకయ్య, సింహాచలం, చిన్నారావు, నాయుడు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు



పెదబయలులో దుర్గాదేవి మండపంలో పూజలు చేస్తున్న భక్తులు



కొయ్యూరులో అన్నసమారాధనలో భక్తులు



అరకులోయలో అన్న సమారాధనలో భక్తులు

అరకులోయటౌన్: మండలంలోని యండపల్లివలస, అరకులోయలో జరుగుతున్న దుర్గామాత శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం అన్నసమారాధన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి, యండపల్లివలస రైల్వే స్టేషన్ వద్ద, అరకులోయ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని, కొత్తవలస ముఖద్వారంలోని దుర్గా భవానీ ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా భవానీ ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. దసరా మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించడానికి ఏర్పాటుచేసినట్టు నిర్వాహకులు చెప్పారు

పెదబయలు: మండలం కేంద్రంలో మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రుల సందర్భంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధనకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. హరి హరపుత్ర మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనకు జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు, నాయకులు సూరయ్య, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మోటార్ యూనియన్ నాయకులు నీలయ్య, కిశోర్, లాలీబాబు, వర్తకులు తదితరులు పర్యవేక్షించారు.

కొయ్యూరు: మండల కేంద్రంలోని దుర్గమ్మ ఆలయం వద్ద శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. అనిశెట్టి సత్యనారాయణ జ్ఞాపకార్థం అతని కుమారులు అనిశెట్టి చిరంజీవి, నాగేశ్వరరావు ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు ప్రసాద్,చిన్న, సర్పంచ్ బాలరాజు పాల్గొన్నారు.

సంతకు పండగ కళ



ముంచంగిపుట్టు వారపు సంతలో మేకలను విక్రయిస్తున్న వ్యాపారులు

మేకలు, నాటుకోళ్లకు గిరాకీ

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో దసరా పండగ శోభ సంతరించుకుంది. దీంతో వారపు సంతలకు సందడి నెలకొంది. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంత కొనుగోలుదారులతో కిటకిటలాడింది. పండగ సమీపించడంతో మారుమూల గిరి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో గిరిజనులు సంతకు పోటెత్తారు. గిరిజనులు అవసరమైన నిత్యావసర సరకులు, పండగ సామగ్రిలను కొనుగోలు చేశారు. పూలు, పండ్లు, కొబ్బరికాయల దుకాణాల వద్ద రద్దీ కనిపించింది.

జోరుగా మేకలు, కోళ్ల అమ్మకాలు

ముంచంగిపుట్టు వారపు సంతలో దసరాతో మేకలకు, నాటుకోళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. మేకలు, కోళ్లను కొనుగోలు చేసేందుకు భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు.దీంతో వాటి ధరలు అమాతం పెరిగిపోయాయి. ధరతో సంబంధం లేకుండా కొనుగోలుకు గిరిజనులు పోటీపడ్డారు. నాటుకోళ్లు సైజు బట్టి రూ.300 నుంచి రూ.2000 వరకు ధర పలికింది. మేకలు రూ.3000 నుంచి రూ.10 వేలకు పైగా ధరకు అమ్ముడుపోయాయి. పండుగ సంత వ్యాపారం బాగుందని వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి

ఆరిలోవ(విశాఖ): కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఓ రిమాండ్ ఖైదీ మృతి చెందాడు. విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం..

గంజాయి కేసులో ముద్దాయిగా కశింకోటకు చెందిన కె.నాగరాజు(32) ఈ ఏడాది మార్చిలో విశాఖ కేంద్ర కారాగారానికి వచ్చాడు. అప్పటి నుంచి ఇక్కడ రిమాండ్‌లో ఉంటున్నాడు. జైల్‌కు వచ్చినప్పటికే మద్యానికి బానిసయ్యాడు. దీనివల్ల ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. మూడు నెలలుగా జైలులో ఆస్పత్రి వైద్యులతో పాటు కేజీహెచ్‌లో డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు. నాగ రాజు ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో ఈనెల 7న కేజీహెచ్ జైలు వార్డులో చేర్పించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతున్న నాగరాజు శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ సమాచారాన్ని ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేసినట్టు సూపరింటెండెంట్ తెలిపారు.

రైతులను ఆదుకునేందుకు చర్యలు

బుచ్చెయ్యపేట: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో రైతులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు తెలిపారు. వ్యవసాయ, అనుబంధశాఖల అధికారుల బృందం రాజాం, కందిపూడి, నీలకంఠాపురం గ్రామాల్లో శనివారం పర్యటించి, వరి నాట్లను పరిశీలించింది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో వరినాట్లు ఎదగలేదని పలువురు రైతులు... బృంద సభ్యులకు తెలిపారు. మోహనరావు మాట్లాడుతూ ఈ ఏడాది సాధారణ వర్షపాతమే కురిసినా అవసరమైన సమయంలో వానలు కురవలేదని తెలిపారు. రైతులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. సబ్సిడీపై అపరాలు, ఆవులు, గేదెల కొనుగోలుకు రుణ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పోలీసు అమరులకు ఘన నివాళి



జద్దంగిలో అమరవీరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు



రాజవొమ్మంగిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



మోతుగూడెంలో పోలీసు అమరువీరులకు నివాళులర్పిస్తున్న జెన్‌కో సీఈ శ్రీధర్, పోలీసులు



మారేడుమిల్లిలో మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు





చింతూరు, గంగవరంలలో ర్యాలీలు నిర్వహిస్తున్న పోలీసులు



వై.రామవరంలో నివాళులర్పిస్తున్న పోలీసులు

రాజవొమ్మంగి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి జిల్లాలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు అధికారులు, సిబ్బంది భారీ ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. విధులు నిర్వహిస్తూ అశువులు బాసిన పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. వారి సేవలను కొనియాడారు. రాజవొమ్మంగి మండల కేంద్రంలో సీఐ బాజిలాల్, ఎస్‌హెచ్‌ఓ (సీఐ) గోపీ నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జద్దంగి పోలీసుస్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో 1999లో జద్దంగి స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తు నక్సల్స్ తూటాలకు నేలకు ఒరిగిన ఎం.సతీష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అడిషనల్ ఎస్ఐ ఎం.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు.

మారేడుమిల్లి : మండల కేంద్రంలో సీఐ రమేష్, గుర్తేడు ఎస్ఐ జ్వాల సాగర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో మానవహారం చేపట్టారు. మారేడుమిల్లి, గుర్తేడు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీసులు, సీఆర్పీఎఫ్ ఈ-42 బెటాలియన్ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ దివాకర్, ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం: మండల కేంద్రంలో ఎస్ఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, పోలీసు అమరులకు నివాళులర్పించారు.

మోతుగూడెం: డొంకరాయి గ్రామంలో ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ర్యాలీ నిర్వహించారు. ఈ హెచ్‌సీ కళ్యాణ్, పీసీలు శ్రీను, నరేష్, సుధాకర్, పోసియ్య, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ పాల్గొన్నారు.ఏపీ జెన్‌కో సీఈ బి.శ్రీధర్‌బాబు, వెంకటేశ్వరరావు, డీఈ బాలకృష్ణ పాల్గొన్నారు.

వై.రామవరం: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ డీ-42 బెటాలియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

- శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేశారు. అష్టోత్తరంపూజ నిర్వహించారు.